కథ

# పునరపి జననం

## కొమ్మూరి వేణుగోపాల రావు

నెమ్మదిగా బలవంతంగా కళ్ళు తెరిచింది సావిత్రి.

కొన్ని క్షణాలు చీకట్లను చీలుస్తున్నట్లు చూపులు బలహీనంగానే కావచ్చు, దూసుకెళుతున్నాయి. తనెక్కడుందో అర్థం కాలేదు కళ్ళని మరింత విశాలంగా తెరిచి చూసింది. తనొక మంచం మీద పడుకోబెట్టబడి ఉందని గ్రహించగలిగింది.

ఆమె కళ్ళు తెరిచిందని గ్రహించగానే, మంచం చుట్టూ మూగారు పది హేనుమంది.

మౌనంగా, మాట్లాడే శక్తి లేక వారివైపే ఆశ్చర్యంగా చూసింది. బోసి నోళ్ళతో, దేవతల్లాగా ఆమెకేసి అమాయకంగా చూడసాగారు. అందరూ తలబాగా పండిన వాళ్ళే. వాళ్ళలో స్త్రీలూ వున్నారు. పురుషులూ ఉన్నారు. ఇంచుమించు తన వయసు వారే.

అసలు వీళ్ళంతా ఎవరు? తనేమిటి యక్కడుంది? ఎప్పుడూ చూడని యీ కొత్త ప్రదేశంలోకి తనెలా వచ్చింది?

ఏదో అడుగుదామని నోరు తెరవబోయింది. గొంతు స్వాధీనంలోకి రావటం లేదు. బలవంతంగా చెయ్యి కదపటానికి ప్రయత్నించింది. 'వద్దూ' అంటూ ఎవరో మృదువుగా పట్టుకున్నారు. అప్పుడు చూసింది చర్మం ముడతలు పడి చెక్కమీద ఆనించబడి వున్న ఆమె చేతికి సెలైన్ పెట్టబడి వుంది. అందులోని ద్రవం చుక్కలు చుక్కలుగా ఆమె శరీరంలోకి ప్రవహిస్తోంది.

నిస్సహాయంగా చుట్టూ వున్న వారివైపు చూసింది. అందరూ తనకేసి వాత్సల్యంగా, కరుణతో, దయతో చూస్తున్నారు.

జీవితంలో ఎన్నడూ ఇలాంటి ఆదరణను అనుభవించలేదేమో ఆమె కళ్ళు వర్షించాయి.

ఆమె కళ్ళలో నీళ్ళు చూడగానే అందరిలోకి పెద్దవిగా అనిపిస్తున్న ఒకావిడ సావిత్రి ముఖం దగ్గరికొచ్చి మెల్లగా చెప్పింది. భయపడకు. నువ్వు క్షేమంగా వున్నావు. దాదాపు పది రోజుల క్రితం ఎవరో కార్లో వచ్చి స్పృహ లేని నిన్ను కార్లో వదిలి వెళ్లారు.

"ఇది... ఇది... " అతి ప్రయత్నం మీద మాట్లాడగలిగింది.

ఆ పెద్దావిడ నవ్వుతూ ఆమె సందేహాన్ని నివృత్తి చేసింది. "ఇది ఒక వృద్ధాశ్రమం"

సావిత్రి కళ్ళలో భావన కనిపెట్టి ఆవిడ కొనసాగించింది. "అవును ఇది ఒక వృద్ధాశ్రమం. మేమూ నీలాంటి వాళ్ళమే. స్వామీ సహజానంద యీ ఆశ్రమం నడుపుతున్నారు. ఆయన ప్రస్తుతం ఊళ్ళో లేరు. ఒక డాక్టర్ని నియమించి నిన్ను బ్రతికించే బాధ్యత మా అందరి మీదా పెట్టి వెళ్లారు. అప్పట్నుంచి మేము వంతుల వారీగా నిన్ను కాపాడుకుంటూ వస్తున్నాము.

అందరి వైపూ కృతజ్ఞతగా చూసింది సావిత్రి.



ఆతృతగా, ఆపేక్షగా చూస్తోన్న బోసి నోళ్ళన్నీ నవ్వాయి.

"సావిత్రీ" అని పిలిచింది పెద్దావిడ.

సావిత్రి కళ్ళు అటుకేసి తిరిగాయి.

పెద్దావిడ నవ్వుతూ "నీ పేరెలా తెలిసిందనా? నిన్నా రోజు కార్లో దించారే వాళ్ళే కొన్ని వివరాలిచ్చారు ఆశ్రమ నిబంధన ప్రకారం. నీ పరిస్థితి చూసి నువ్వు బ్రతుకుతావనుకోలేదు. చాలా..." గొంతు గద్గదమై ఆగిపోయింది. అదంతా ఎందుకులే! అన్నట్లు కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయింది.

మెల్లగా తల నిమురుతూ "నిజానికి యిది నీకు మరో జన్మ సావిత్రీ" సావిత్రి పెదవుల మీద శుష్కహాసం. క్రమంగా ఆమె సందేహాన్ని ఓ రూపాన్ని సంతరించుకున్నాయి.

అవును. దీనికిది పునరపి జననం. ఇలాంటి జననాలు తన జీవితంలో ఎన్నో...

ఆలోచించే శక్తిలేక కళ్ళు మూసుకుంది.

ఆమెను విశ్రాంతికి వొదిలి ఒక్కొక్కరే బయట కెళ్ళి పోయారు. కాసేపటికి సావిత్రి నిద్రలోనికి వొదిగిపోయింది.

* * *

పదహారేళ్ళ వయసులో సావిత్రి కవుల కలల్లో ఆరాట పడే ముగ్ధ మనోహరి. ఆమె వయసు, అందం చూసి ఎందరో ఆమె జీవితంలోకి జొరబడలని ప్రయత్నించి సఫలీకృతులు కాలేక పోయారు.

ఆమె కోరుకున్నవి చూసి సహజ మనోహర జీవితం. తండ్రి ఓ సంబంధాన్ని తీసుకొచ్చినప్పుడు ఆ అబ్బాయిని చూసి మనసారా యిష్టపడింది.

పెళ్ళి జరిగిపోయింది. చదువుకు తిలోదకాలిచ్చింది ఆ కొత్తవూళ్ళో చక్కని పల్లెటూరు వాతావరణం అత్తారింటి జీవితంలో యిమిడి పోయింది. భర్త మంచివారు. సౌమ్యుడు. ఆమెను గొప్పగా చూసుకున్నారు. అత్తారింట్లో దేనికీ లోటు లేదు ప్రతి స్త్రీ కలలు కనే జీవితం తనకు లభ్యమైందని మురిసిపోయింది.

ఉన్నట్టుండి ప్రకృతి ఓ భయంకరమైన ఉరుము ఉరిమింది మసూచి రూపంలో. ఆ మసూచికి బలైపోయిన ఆమె భర్త ఆమెను విడిచి పైలోకానికి వెళ్ళిపోయారు. అప్పటికి ఆర్నెల్ల బాబు మురళిని ఆమెతో బాటు వదిలి పెట్టి.

అంత వరకూ స్వర్గధామంలో విలసిల్లిన మెట్టినంట్లో వున్న వాతావర్ణం మారిపోయింది. ఆమె తీవ్రమైన నిరాదరణకు గురయింది. పుట్టింటి పరిస్థితులు... అన్నలూ... వదిలూ, ఇంకా పెళ్ళి కావల్సిన చెల్లెళ్ళూ, ఆర్థిక బాధలూ... మరీ అధ్వాన్నంగా వున్నాయి.

వొంటరిగా, పట్టుదలతో ఆర్నెల్ల పసివాడితో

విశాల ప్రపంచంలోకి అడుగు పెట్టింది.

బాల స్నేహితురాలు సరళ ఆ సమయంలో ఆదుకుంది. సరళ ప్రోత్సాహంతో విస్తరాకులు కుట్టి కొట్లకు వేస్తుండేది. కొంచెం కొంచెంగా సంపాదిస్తూ సంవత్సరం తిరిగే సరికి కొంత సొమ్ము కూడబెట్టింది. సరళ విస్తరాకుల కొట్టు పెట్టుకుంది.

"వొద్దు ఈ పద్ధతిలో వ్యాపారం చేస్తాను" అంది సావిత్రి.

"ఇలా ఎంత కాలం చేస్తావు? నువ్వింకా ఎదిగి పోవాలి"

"అందుకే చదువుకుంటాను"

ఆమె మాటల్లోని మృధుత్వం చూసి సరళ యింకేమీ తర్కించ లేదు.

ఆ క్షణం నుంచి కొన్ని సంవత్సరాల పాటు విశ్రాంతి అంటే మరచిపోయింది సావిత్రి.



ఓ పక్క పిల్లాడ్ని పెంచుతూ, మరో పక్క విస్తరాకుల వ్యాపారం చేస్తూ, రాత్రింబవళ్ళు శ్రమించి చదువుకుని బి. ఇ.డి. పూర్తి చేసి టీచర్‌గా ఉద్యోగం సంపాదించింది.

మురళీ కొంచెం పెద్దవాడయ్యాడు. జీవితాన్ని ఓ ఉద్యమంగా వివరించిన సావిత్రికి ఒకటే లక్ష్యం. మురళిని పెద్ద చదువులు చదవించాలని జీవితమనేది చాలా విలువైనది. అదో కఠోర తపస్సు. ఆమె తపన... అతన్ని బాగా చదివించటంతో బాటు క్రమ శిక్షణతో తీర్చిదిద్దాలి.

చుట్టూ వున్న సమాజం సావిత్రి జీవిత పోరాటాన్ని గమనిస్తూనే వుంది. కొంతమంది ఆమెతో బాటు మురళి బాధ్యతను కూడా గమనించటానికి సంసిద్ధతను వెల్లడి చేస్తూ ముందు కొచ్చారు. వారందరికీ ఆమె మృదువైన చిరు నవ్వుతోనే నమస్కారాలు తెలియజేసింది.

వయసు పెరుగుతూన్న కొద్దీ తల్లి తనను పెంచటానికి ఎంత శ్రమ పడుతున్నదో మురళికి అర్థం కాసాగింది. తల్లి అంటే అతనికి ఎనలేని ప్రేమ. ఆ ప్రేమను గుండెల నిండా నింపుకున్నాడు.

అతను బాగా పెద్దవాడయ్యాడు. చదువు పూర్తి చేసి మంచి వుద్యోగం సంపాదించాడు. తల్లిని ఉద్యోగం మాన్పించాడు. కొంచెం విశాలంగా వున్న వేరే ఇంట్లోకి మారాడు.

కాలగతిలో సహజ సన్నివేశాలు జరిగిపోవాలి కదా. మురళి పెళ్ళి ప్రసక్తి వచ్చింది. అప్పటికే అతనో అమ్మాయిని ప్రేమించాడు. ధైర్యంగా ఆమెను తీసుకొచ్చి తల్లికి చూపించాడు.

కొడుకు ఎంపికకు ఆమె సంతోషించింది. పద్మ ఆమె కెంతగానో నచ్చింది.

వాళ్ళిద్దర్నీ మనసారా ఆశీర్వదించి పెళ్ళి జరిపించింది. ఎన్నో సుదీర్ఘ సంవత్సరాల తర్వాత ఆమె మనసు శరీరం విశ్రాంతిని కోరుకున్నాయి.

ఆమె మనసులో వున్న కోరికను గ్రహించినట్లు పద్మ అన్నది. "అత్తయ్య గారూ ఇన్నాళ్లూ మీరు కష్టపడింది చాలు. ఈ రోజు నుంచే మీరు వంటింట్లోకి అడుగు పెట్టటానికి వీల్లేదు. అంతే"

కోడలు చూపించిన గౌరవానికి, ఆదరణకూ, చనువుకూ సావిత్రి శరీరం పులకించిపోయింది. నవ్వి వూరుకుంది.

చాలా కాలం తర్వాత ఆ యింట్లో మూడో మనిషి వంట చెయ్యటం. కోడలికి తెలియక పోతే అత్తగారిని అడిగేది. పర్వాలేదు. తన శేష జీవితం హాయిగా గడవబోతుంది. అని సావిత్రి సంతోషించింది.

ఓ వారం గడిచింది

ఆరోజు భోజనాల దగ్గర అన్నాడు మురళి. "ఈ వంట తినలేక చస్తున్నాను. కాస్త సరిగ్గా వండలేవా పద్మా?"

"నాకు వండటం కొత్తని మీకు తెలుసుగా. అయినా అన్నీ అత్తయ్య గారిని అడిగే చేస్తున్నాను" అంది పద్మ.

సావిత్రి నవ్వుతూ "పోనీలేరా. నాలుగు రోజులు పోతే అమ్మాయి చక్కగా నేర్చుకుంటుంది. ఇదేమన్నా బ్రహ్మ విద్యా ఏమిటి?"

"నాలుగు రోజులు కాదు గదా నాలుగు సంవత్సరాలయినా అది నేర్చుకోలేదు. ఆ వాలకం తెలిసిపోతున్నది కదా"

పద్మకు కోపం వచ్చింది. "అయితే నన్నిప్పుడేం చెయ్యమంటారు?"

"మా అమ్మలా..."

"అమ్మ... అమ్మ... అమ్మ... ఇవాల్టి నుంచీ ఆవిడ్నే వండమనండి. ఈ రోజు నుంచి నేను వంటింట్లో అడుగు పెడితే ఒట్టు"

మళ్ళీ మొదటికి...

కొన్ని ఎందుకు జరుగుతాయో తెలియదు. తరచి చూస్తే కారణాలేమీ కనబడవు. కానీ పరిణామాలు తీవ్రంగా వుంటాయి.

జరిగింది చాలా చిన్న విషయం. కాని ఎక్కడో ఏదో అపశృతి. మళ్ళీ పాత సావిత్రి అయిపోయింది. కేవలం వంట వరకే పరిమితం కాకుండా, కోడలి దుడుకు తనానికి ఆ ఇంట్లో పని చెయ్యడానికి ఎవరూ ముందుకు రాని కారణంగా మిగతా ఇంటి పనుల బాధ్యత కూడా పైన పడింది.

సర్దుకు పోయింది తప్పించుకోలేక.

విశ్రాంతి కరువయింది. నిర్వికారంగా, నిర్లిప్తంగా రోజులు గడిచిపోతున్నాయి.

అందినట్లే అంది చేజారిపోయిన కొత్త జన్మ. పోనీ నిర్దాక్షిణ్యంగా చుట్టుకున్న ఇంకో జన్మ.

ఓ ఏడాది గడిచిపోయింది. పద్మ ఇప్పుడు గర్భవతి. మురళి ఆమెను గారాబంగా, అపురూపంగా చూసుకుంటున్నాడు. పద్మని చూడటానికి ఆమె తల్లిదండ్రులు, ఇంకా ఎవరెవరో చుట్టాలు వస్తున్నారు. పోతున్నారు. వాళ్లందరి చాకిరీతో సతమతమై పోతోంది సావిత్రి. పూర్వంలా శరీరం సహకరించటం లేదు. తూలిపోతున్నట్లుగా, వాలిపోతున్నట్లుగా అనిపించేది.

పద్మకి ఏడో నెల వచ్చాక పుట్టింటికి వెడుతుంది. కొన్నాళ్ళు తనకు వెసులు బాటు అని ఆశపడింది.

పద్మ మురళి గుండెల మీద తల వాల్చి "మిమ్మల్ని విడిచి అన్నాళ్ళు ఉండలేనండి. కావాయినా పాపనో, బాబునో మూడో నెల వచ్చే వరకూ అక్కడే ఉండాలి కదా" అంది గారాబంగా

"అవునవును నిన్ను విడిచి నేను ఉండలేను" అన్నాడు మురళి.

తొమ్మిదో నెల దాటుతుండగా పద్మని వాళ్లింటికి తీసుకెళ్లారు ఆమె తల్లిదండ్రులు.

..... ఆడపిల్లని ప్రసవించింది.

పాపను చూసొచ్చిన ఓ నిర్ణయం తీసుకుంది సావిత్రి. మురళీ ఆఫీసు నుంచి వచ్చాక అడిగింది. "మన పక్కింటి వాళ్లు నెల రోజుల పాటు తీర్థయాత్రలు వెళతారట. నన్ను కూడా రమ్మంటున్నారు. నాకూ వెళ్ళాలనే ఉంది. ఏమంటావు?"

మురళీ ఆలోచించాడు. తన తల్లి జీవితంలో కోరిన మొదటి కోరిక. ఒక్కసారిగా ఆమెను చూస్తే జాలేసింది.

"అలాగే తప్పకుండా వెళ్లిరామ్మా" అన్నాడు.

ఆ రోజు ప్రశాంతంగా నిద్రపోయింది.

మర్నాడు ఇంటి ముందు ఆటో ఆగితే చూసింది. చేతిలో పాపతో పద్మ. మురళి బయటికెళ్ళి ఆటోలోని పెట్టెలను బయటకు దించుతున్నాడు.

సావిత్రి గుమ్మం దాటి బయటకు వెళ్లి "ఏమైంది బాబూ" అనడిగింది.

మురళి ముఖం చాలా కోపంగా ఉంది. "పిల్లల్ని ఆడించడం తెలిసి ఏడిస్తేగా. అక్కడ..."

"ఇదిగో మా అమ్మా వాళ్లని అనొద్దు చెబుతున్నా. ఆవిడ ఆరోగ్యం మంచిది కాదు"

"అందుకని చెప్పాపెట్టకుండా వచ్చేస్తావా?"

"ఎక్కడికొచ్చాను. నా ఇంటికొచ్చాను. దీనికి పర్మీషన్ కూడా తీసుకోవాలా ఏమిటి?"

"రోడ్డు మీద ఏమిట్రా గలాబా? లోపలికి రండి" అంది సావిత్రి మందలింపుగా.

లోపలికి వచ్చాక

"పిల్లకు నలుకు పెట్టించడం చేత కాదు. దిష్టి తియ్యటం చేత కాదు. పాపను పాడు చేసేస్తున్నారు"

"మా అమ్మ చూడు ఎలా చేస్తుందో. చూసి నేర్చుకోమను" సావిత్రి మ్రాన్పడిపోయింది. నిన్న తనను తీర్థయాత్రలకు వెళ్లి రమ్మని చెప్పిన కొడుకేనా వీడు... జరిగిందేదో ఎవరిది తప్పో తెలియటం లేదు. సంవత్సరాల తరబడి వాయిదా పడుతున్న విశ్రాంతి మళ్లీ వాయిదా పడిపోయింది.

అలిసిపోతున్న శరీరాన్ని బలవంతంగా నిద్రలేపింది.

* * *

తర్వాత యిరవై ఏళ్ళు...

మొదటి పాప మానస

తర్వాత శరత్ చంద్ర

మధ్యలో గర్భాలు, ఎబార్షన్‌లు, పద్మకు డాక్టర్లకు కూడా అర్థం కాని అనారోగ్యాలు, కొడుక్కి యాక్సిడెంట్, అంతు లేకుండా పెరిగిపోతున్న సమస్యలు, చాకిరీ...

ఇప్పుడు సావిత్రి వయస్సు డెబ్బై సంవత్సరాలు. జీవితంలో రుచి గురించి ఆలోచించుకుంటోందా? తనదైన జీవితాన్ని జీవిస్తుందా? తనది కాని జీవితంలో చుట్టుకు పోతుందా? వ్యక్తిత్వానికి అర్థం మరిచి పోయిందా? గట్టిగా దిగులు పడితే సెల్ఫ్ పిటీ అని యితరులు గేలిచేసే నిజంతో దోబూచులాడుతోందా? అర్థంకాక పోవడంలోని మందకొడి తనాన్ని ఆస్వాదిస్తుందా?

* * *

"అమ్మా వధూవరులను దీవించు" మురళి గొంతు వినబడేసరికి ఉలిక్కిపడి చూసింది. వాతావరణం కోలాహలంగా ఉంది. పెళ్ళి మండపం దిగి ఆమె దగ్గర కొచ్చారు మానస, పెళ్లి కొడుకు.

"మా నాన్నమ్మ నా దైవం" అంది భర్తను పరిచయం చేస్తూ మానస. ఇద్దరూ ఆమె పాదాల మీదకు వంగారు. పులకరించి పోయింది. మనసారా దీవించింది.

మనమరాలి పెళ్ళయిపోయిందంటే ముసలి మనసు మూగగా రోదించింది. చుట్టూ అందరూ వున్నారు. కాని యీ ఆర్ద్ర హృదయానికి దగ్గరగా ఎవరూ లేరు. మానసతో ఆమె తోడు ఊరటగా వుండేది ఇప్పుడామె పూర్తిగా ఒంటరిదయి పోయింది. ఖాళీ సమయంలో తన గదిలో ఒంటరిగా గడుపుతోంది. రాత్రిళ్లు నిద్రవుండేది కాదు. గుండెల్ని పిండే ఆవేదన, ఆ ఆవేదనకి వాణికి పోయే శరీరం.

క్రమేపీ క్షీణించసాగింది.

ఆమెకు తరచుగా వంట్లో బాగుండక పోవటంతో మురళి హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళి చూపించాడు. వాళ్ళేవో చెప్పారు. అతనవేవీ చూయించినట్లు లేదు. ఏదో మాట్లాడతాడు. బయటకు మాత్రమే వ్యక్తమయ్యే ప్రేమను ఏనాడో గుర్తించడం మానేసింది.

శరీరంలో ఏదో జరిగిపోతున్నది. తట్టుకోలేక పోతున్నది.

ఒక రాత్రి మెలుకువ వచ్చింది.

దాహం వేసి మంచం మీద నుంచి లేవబోయింది. సాధ్యం కాలేదు. కొడుకునీ, కోడల్ని పిలుద్దామనుకుంది గానీ విఫలురాలయింది.

మృత్యు బాధ ఎలా ఉంటుందో అనుభవిస్తున్నది. తల్లో గిరగిరమని తిరిగిపోతున్నట్లు, ఎక్కడికో లోయలోకి పడిపోతున్నట్లు, కళ్లు తెరుచుకుంటున్నాయి. మూతలు పడుతున్నాయి. కళ్ళ వెంట ధారలుగా నీళ్ళు...

ఆ స్థితిలో కూడా ఏవో మాటలు కలగా వినిపిస్తున్నాయి.

## ప్రముఖుల ముచ్చట్లు!

"సుఖ, సంతోషాలు ఎక్కడ వుంటాయి మామగారు?" అని ఒక అభిమాన పాఠకుడు సోమర్‌సెట్ మామ్‌ను అడిగాడు

"తెలివితక్కువవాడు సుఖ సంతోషాల కోసం ఎక్కడో దూరంగా వెతుకుతాడు. తెలివైనవాడు మాత్రం తన ముందే వాటిని సృష్టించుకోగలుగుతాడు!" అని చెప్పారు మామ్

–కె.పద్మాదేవి

"డాక్టర్ గారూ ఎలా ఉంది ఆవిడకు?" మురళి గొంతు

"కోమాకు ముందు దశ, హాస్పిటల్‌లో అడ్మిట్ చేయాలి..."

డాక్టర్ గారు వెళ్లి పోయినట్టున్నారు.

"ఇప్పుడేం చేద్దాం?" అడుగుతున్నాడు మురళీ

"ఏ గవర్నమెంట్ హాస్పిటల్‌లోనో, అనాధ శరణాలయంలోనో పారెయ్యండి"

ఏం వింటున్నది తాను?

"ఈ... చివరి రోజుల్లోనా?"

"చివరి రోజుల్లో కాబట్టే చెబుతున్నాను. శుభమాని మొన్ననే అమ్మాయి పెళ్ళి చేసాము? పెళ్ళి కళతో ఉన్న ఇంటిని చావు కళగా మారుస్తారా?"

తర్వాత ఇంకేం వినబడ లేదు.

* * *

వృద్ధాశ్రమంలో చాలా చిత్రంగా త్వరత్వరగా కోలుకుంటుంది సావిత్రి. సహవృద్ధులు కురిపించిన మానవత్వం, అనునయ వాక్యాలు, ఆ ప్రశాంత వాతావర్ణం ఆమెను మళ్లీ మామూలు మనిషిని చేశాయి.

మరో పది రోజులకు మెల్లగా లేచి తిరగగలిగింది.

స్వామీజీ ఊరి నుంచి వచ్చారు.

ఆజాను బాహువు. ప్రశాంత గంభీర వదనం. సావిత్రిని గురించి అడిగి తెలుసుకుని, తర్వాత ఆమెతో చాలా సేపు సంభాషించారు. ఆయన మాటలు ఆమెలో మరింత నూతనోత్తేజాన్ని నింపాయి.

రోజూ స్వామీజీ ఆధ్యాత్మిక కాలక్షేపం పదకొండు గంటలకు భోజనం, మధ్యాహ్నం చేతి పనులు, సాయంత్రం చిన్న చిన్న ఆటలు, తర్వాత భగవత్‌గీతా పారాయణం.

ఆయన స్వామీజీలా కాక అప్పుడిలా, స్నేహితునిలా చూసుకునే వాడు. అందర్నీ చిన్న పిల్లల్లా చూసేవాడు. అందరూ ఒకే కుటుంబంలా కలిసిపోయేవారు. మురళి, మానస గుర్తు వస్తోన్నా యీ శాంత జీవనంలో అంతగా బాధనిపించేది కాదు.

ఒక రకంగా కొడుకు స్వార్థం తనకి మేలే చేసింది. అతని ప్రవర్తన, యీ చివరి దశలో వృద్ధాశ్రమంలో పడవేయటం. .. సమాజం అతన్ని క్రూరుడిలా చిత్రించవచ్చు. కాని తనకు జరిగిన యీ చివరి న్యాయం వల్ల అతని వల్ల ద్వేషభావం కలగటం లేదు.

ఇక్కడ చాడీలు లేవు. గిల్లి కజ్జాలు లేవు. అధిక ప్రసంగాలు లేవు.

ప్రేమ...

ఎలాంటిది?

అందుకోవలసినట్టిది

పసిపాప బోసి నవ్వుతో వెల్లి విరుస్తుంటే అలాంటిది.

* * *

ఆశ్రమం వెనుక భాగంలో వున్న తోటలో మొక్కలకు నీళ్ళు పోస్తోంది సావిత్రి.

ఒకావిడ వచ్చి " మీ కోసం ఎవరో వచ్చారు" అని చెప్పింది.

తనకోసం... ఆమె ఆశ్చర్య పడలేదు. నెమ్మదిగా అడుగులు వేస్తూ స్వామీజీ వున్న హాల్లోకి వెళ్ళింది.

స్వామీజి ఆయన ముందు కూర్చుని మురళి, పద్మ కనిపించారు. మురళి తల్లిని చూడగానే కళ్ళ నీళ్లు పెట్టుకున్నాడు. పద్మ బావురుమని ఏడ్చింది.

ఇద్దరూ ఆమె పాదాల మీద పడ్డారు. కంగారుగా వెనక్కి జరిగింది..

"అమ్మా! మమ్మల్ని క్షమించు. నువ్వు లేని లోటు, నీ విలువ తెలుసుకున్నాం...

సావిత్రి నిర్లిప్తంగా చూస్తోంది. ఆమెలో ఏ భావమూ కలగడం లేదు.

"నువ్వు మాకు కావాలి అమ్మా..."అతని గొంతు వణుకుతోంది.

అమ్మ,

అ...మ్మ...

అ...అ...అ...మ్మ...మ్మ...మ్మ...

ఈ పదం ఆమెలో ప్రకంపనయి లేవసాగింది. మెల్లగా భావాలు చోటు చేసుకుంటున్నాయి.

ఆమె ఉత్తేజితురాలవుతోంది.

సృష్టి ఆమె ముందు తలవంచినట్లు, ఈ ప్రకృతి చాలా మెల్లగా, వినిపించి వినిపించనట్లు విలపించినాయి. "నువ్వు మాకోసం కాకపోయినా నీ మనుమరాలి కోసం రావాలమ్మా"

సృష్టి ఆమెతో పూర్తిగా యిమిడింది. తర్వాత నరనరాల్లో చిన్న వొణుకు...

ఏ...ఏమయింది. మానసకు?

"మానసకు ఏదో తెలీని సుస్తీ. క్షీణించి పోతోంది. మధ్య మధ్య నీ గురించి కలవరిస్తోంది."

మధ్య మధ్య...సావిత్రి పెదవుల మీద చిరునవ్వు.

పద్మ సంగతి తెలుసుగా. అసలే భయస్తురాలు. అందులోనూ తన ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే.

వాళ్ళు తనని పిలుస్తున్నారు.

మానస తాను లేకపోతే దక్కదవా? డాక్టర్ల శాస్త్ర విజ్ఞానం అంత మూగ పోయిందా? తాను వెళ్ళగానే 'నానమ్మ' అంటూ కూచోటానికి ఇదేమన్నా సినిమానా?

వాళ్లు తనని పిలుస్తున్నారు.

చాకిరేనా?

అప్పుడు తాను కొంతవరకు ఆరోగ్య వంతురాలు. ఈ ఆరోగ్యం వాళ్లకి కొన్నాళ్ళు సేవ చేయడానికి ఉపయోగపడుతుంది.

తర్వాత...

ఎటూ తేల్చుకోలేక స్వామీజీ వంక చూసింది.

ఆయన చిరునవ్వు నవ్వాడు.

"అమ్మా! అన్నాడు.

ఆయన నోట్లోంచి వెలువడిన యీ అమ్మ పదం ఎంత మధురంగా వుంది! సాక్షాత్తూ పరమేశ్వరుడే పిలిచినట్లు.

"చూడమ్మా, నీ కో సత్యం చెప్పాలి. ఏ ఆధ్యాత్మిక ధర్మం కూడా బంధాల్ని చిన్నచూపు చూడలేదు. గౌరవించింది. బాంధవ్యాన్ని చర్చించింది. బంధనాన్ని విశదీకరించింది. బంధాన్ని అంగీకరించింది. ఆమోదించింది.

'నువ్వు ఆశ్రమంలో వుంటున్నావు. కాని సన్యాసినివి కాలేదు. ఒకవేళ అయివున్నా సన్యాసి కాని ,సుఖంతో కుటుంబ సభ్యుల దగ్గరకు వెళ్ళ నక్కరలేదు. కష్టంలో వెళ్ళాలి'.

ఇంతకు ముందు నువ్వు జీవితాన్ని ఒకవైపు నుంచే పరిశీలించావు. ఇప్పుడు పరిపూర్ణ దృష్టితో చూడగలుగుతున్నావు. బంధానికి నువ్వు లొంగి పోవడంలేదు. దాని విలువని గౌరవిస్తున్నావు. ఆ విలువని యీ అల్ప ప్రపంచానికి చాటి చెబుతున్నావు.

"నీ కొడుకు, కోడలు...వీళ్ల మాటలను నువ్వు వశురాలవు కావడంలేదు. నువ్వు వాళ్లని దూరం చెయ్యగలవు. నువ్వు..

"నువ్వు వాళ్లని క్షమిస్తున్నావమ్మా"

మురళి, పద్మల తలలు అవమాన భారంతో క్రిందకు వాలి పోయాయి.

సావిత్రి ఆశ్రమంలోని అందరి దగ్గరా సెలవు తీసుకుంది. అందరి ముఖాల్లో ఆమె వెళ్లిపోతోందన్న దిగులు.

కొడుకు, కోడలితో కారు దగ్గరికి కదిలింది.

"చూడమ్మా సావిత్రీ" అన్నాడు స్వామీజీ, ఆమె తనను చేతులు జోడించినప్పుడు, నీ చిన్నతనం నుంచే నువ్వు ఎన్నిసార్లు మృత్యువును సమీపించావో, మానసికంగా ఎన్నిసార్లు చచ్చిపోయావో, ఎన్నిసార్లు కొత్త జన్మ ఎత్తావో చెప్పావు. ఇప్పుడే ...యీ జన్మలోనే మళ్ళీ మళ్ళీ జన్మించి పునరపి జననం అనే మాటలు యిక్కడే, యిప్పుడే సార్థకం చేస్తున్నావు. శుభం. వెళ్ళి...రా.."

సావిత్రి వేదనగా నవ్వి మళ్ళీ ...మరో...

ఉష్ అన్నట్లు సంజ్ఞ చేసి "అప్పుడు మళ్ళీ చెప్తమంటాం అన్నాడు స్వామీజీ.

సావిత్రి మళ్ళీ నవ్వింది. ఇప్పుడా నవ్వులో వేదన లేదు.

కొడుకు డోర్ తీసిపట్టుకోగా చాలా మామూలుగా కారెక్కింది.




# శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానము

## ద్వారకాతిరుమల (చిన్నతిరుపతి), పశ్చిమగోదావరి జిల్లా - 534 426.

ఫోన్స్ : ఎస్.టి.డి.-08829, కార్యనిర్వహణాధికారి కార్యాలయము - 7436, ఆఫీస్ -7427

శ్రీస్వామివారి నిత్యాన్నదాన పథకము : అన్నం పరబ్రహ్మేతి వ్యజనాత్ అన్నమే పరబ్రహ్మస్వరూపమని పెద్దల నానుడి. అన్నదాన సమందానం నాస్తి నాస్తి. దానములలో అన్నదానము కంటే మించిన దానము లేదని వేదములలో చెప్పబడినది. భక్తుల అన్నార్తిని తీర్చి వారిని తరింపచేయుటకు ది. 8-12-94 నుండి శాశ్వత నిత్యాన్నదాన పథకము ప్రవేశపెట్టబడినది. అన్నదాన పథకములో చేరగోరు భక్తులు వారి గోత్రనామములతో అన్నదానము చేయించుకొను మహద్భాగ్యము పొంది శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కాగలరు. భక్తులు చెల్లించిన విరాళములు శ్రీ స్వామివారి పేరున డిపాజిట్ చేయబడి అందుపై వచ్చే వడ్డీతో సంవత్సరములో ఒక రోజున వారు కోరిన రోజున భక్తులకు అన్నదానము చేయబడును.

అన్నదాన పథకమునకు విరాళములు చెల్లించుదాతలు రూ. 1,116/- లుమరియు అంతకు రెట్టింపు చెల్లించవచ్చును. 1. రూ. 3,65,000/- లు చెల్లించిన వారిని మహాన్నదాతగా గుర్తించి, రెండువారములు ఉచిత వసతి, శ్రీస్వామివారి కళ్యాణము, పూజలు మరియు వారి పేరుతో ప్రతి రోజు 10 మందికి అన్నదానము జరుపబడును. 2. రు. 1,00,000/- లు ఆపైన చెల్లించుదాతలు మహారాజ పోషకులుగాను, 3. రూ. 50,000/- లు మించి చెల్లించిన దాతలను రాజపోషకులుగానూ, 4. రూ. 10,000/- లు చెల్లించిన దాతలను పోషకులుగానూ, 5. రూ.1116/- నుంచి చెల్లించిన వారిని దాతలు గాను గుర్తించి సంవత్సరంలో దాతలు కోరిన ఒక రోజున శ్రీ స్వామివారి దర్శనార్థము వచ్చు యాత్రీకులకు అన్నధానము జరుపబడును. దాతలు అన్నదానమును స్వయంగా గాని పరోక్షముగా గాని జరిపించుకోవచ్చును. దాతలు చెల్లించు సొమ్ము డి.డి. ద్వారాగాని, చెక్కు ద్వారా గాని కార్యనిర్వహణాధికారి, శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానము, ద్వారకాతిరుమల అను పేరును పంపవలెను. ఆర్జితసేవలు విరములు : 1. శాశ్వత అన్నదానము రూ. 3,500 లు సంవత్సరమునకు ఒకరోజున శ్రీ స్వామి వారి కళ్యాణము జరుపబడును. 2. నిత్య ఆర్జిత కళ్యాణము : రు. 301/- లు మరియు 500/- లు, 3. శాశ్వత సహస్ర నామార్చన : రు. 150/- లు సంవత్సరములో కోరిన రోజున శ్రీ స్వామివారికి పూజ జరింపించబడును . 4. శాశ్వత అష్టోత్తర నామార్చన రు. 116/-లు సంవత్సరములో కోరిన రోజున శ్రీస్వామివారికి పూజ జరిపించబడును.



శ్రీ ఎస్.వి. సుధాకరరావు
వంశపారంపర్య ధర్మకర్త మరియు ధర్మకర్తల మండలి అధ్యక్షులు అధ్యక్షులు మరియు ఫౌండర్ ట్రస్టీ

శ్రీ ఎస్. ఇంద్రేష్‌రావు
వంశపారంపర్య ధర్మకర్త ధర్మకర్తల మండలి అనుశ్రిత అధ్యక్షులు, ఫౌండర్ ట్రస్టీ



ఎస్. సోమశేఖర్ బి.కామ్. బి.ఎల్.
ఉపకమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి

భారీ నిర్మాణము చేపట్టబడినది - భూరి విరాళములు ఇవ్వ ప్రార్థన.